సాక్షి ఒడిశా

ఆదివారం । 5 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,65,167
బంగారం	100 మిల్లీ గ్రాములు
వెండి	49 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



రత్న భాండాగార్‌కు లేజర్ స్కానింగ్

పూరీలో జగన్నాథ స్వామివారి ఆలయంలోని రత్న భాండాగార్‌లో లేజర్ స్కానింగ్ చేయడానికి భారత పురావస్తు శాఖకి అనుమతించినట్లు శ్రీజగన్నాథ ఆలయం ప్రధాన పాలన అధికారి సీఏవో రంజన్ కుమార్ దాస్ తెలిపారు.

- 8లో



వైభవం.. ఆదివాసీ మహోత్సవం

జయపురం సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మలో ప్రసిద్ధ భైరవ మందిర ప్రాంగణలో రాష్ట్రస్థాయి ఆదివాసీ మహోత్సవం కొరాపుట్-23 శనివారం ప్రారంభమైంది.

- 8లో

న్యూస్‌రీల్

భువనేశ్వర్ టు జైపూర్

- రేపటి నుంచి మరో విమానం ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్రంలో విమానాయన సౌకర్యం అంచెలంచెలుగా విస్తరిస్తోంది. ఈ ప్రక్రియను మరింత ప్రోత్సహిస్తూ కొరాపుట్ జిల్లా జయపురం మరియు భువనేశ్వర్ మధ్య రెండో ప్రత్యక్ష విమానయాన సేవలు ఈనెల 6 (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) శనివారం వెల్లడించింది. రెండో విమాన సేవలు విమానాయన సౌకర్యం మరింత పెంచుతాయి. ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాల పురోగతికి దోహదపడతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయంతో ఈ విమాన సేవలను ప్రతివారం సోమ, శుక్రవారాల్లో రోజుకు రెండుసార్లు ఇండియా వన్ ఎయిర్ నిర్వహిస్తుంది.

నివేదిక ప్రకారం...

స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) నుండి విమానం ఉదయం 7.10 గంటలకు బయల్దేరి 8.45 గంటలకు జయపురం విమానాశ్రయం చేరుతుందని ఇండియా వన్ ఎయిర్ సంస్థ తెలిపింది. తిరుగు ప్రయాణంలో విమానం జయపురం నుంచి ఉదయం 9.00 గంటలకు బయల్దేరి 10.35 గంటలకు భువనేశ్వర్‌లో విమానం దిగుతుంది. నవంబర్ నెలలో ప్రారంభ కానుకగా విమాన సర్వీసు టిక్కెట్ల ధర రూ.2,999గా నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇండియా వన్ ఎయిర్ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌కి లాగిన్ అయి ఆసక్తి ఉన్న వ్యక్తులు తమ టిక్కెట్లను బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గతేడాది అక్టోబర్ 31న భువనేశ్వర్ మరియు జయపురం మధ్య తొలి విమానయాన సేవలను ప్రారంభించారు. పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఉడే దేశ్ కీ ఆమ్ నాగరిక్ ఉడాన్ పథకం కింద ప్రాంతీయ విమానయాన సేవల కోసం వాణిజ్య విమాన కార్యకలాపాలను నిర్వహించడానికి జయపురం విమానాశ్రయానికి లైసెన్స్ మంజూరు చేసింది. రాష్ట్రంలో విమానాలు నడపడానికి లైసెన్స్ పొందిన మొదటి ప్రభుత్వ యాజమాన్య విమానాశ్రయం జయపురం కావడం విశేషం

యువకుడు అనుమానాస్పద మృతి



చెట్టుకు వేలాడుతున్న తరుణ్ నాగ్ మృతదేహం




తరుణ్ నాగ్ (ఫైల్)

రాయగడ: చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని జిల్లాలోని అంబోదల పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు పొరుగు జిల్లా కలహండిలోని విశ్వనాథ్‌పూర్ పంచాయతీ డుముర ముండ గ్రామానికి చెందిన తరుణ్ నాగ్ (21)గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. అంబోదల పోలీస్‌స్టేషన్ పరిధి ఇచ్ఛాపురం పంచాయతీ పాకొరి గ్రామానికి సమీపంలోని అడవుల్లో ఒక యువకుడి మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. సమాచారం తెలుసుకున్న మునిగుడ ఎస్డీపీవో ఒరం, అంబోదల పోలీసుస్టేషన్ ఐఐసీ కార్తీక్ నాయక్‌లు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుని అన్నయ్య సిద్ధార్థ్ నాగ్ తన తమ్ముడుని ఎవరో హత్య చేసి ఇలా ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని అంబోదల పోలీస్‌స్టేషన్‌లో ఈ మేరకు ఫిర్యాదు చేశాడు. గత మూడు నెలలుగా తన తమ్ముడు కలహండి జిల్లా విశ్వనాథ్‌పూర్ పంచాయతీలోని డుముర ముండ గ్రామానికి చెందిన ఒక యువతితో ప్రేమలో పడ్డాడని తెలియజేశాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆ యువతీ, తన తమ్ముడు ప్రేమ వివాహం చేసుకునేందుకు, తమ ఇంటి నుంచి రూ.95 నగదుతో పాటు మరో మూడు తులాల బంగారంతో ఇంటి నుంచి పారిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతలో తన తమ్ముడు ఇలా ఆత్మహత్య చేసుకున్నట్లు తమకు సమాచారం అందడంలో పలు అనుమానాలకు దారితీస్తోందని వివరించారు. దీంతో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

• వెలుగులు నింపిన వంతెన

ఇక్కడి గిరిజనులు అభివృద్ధి బాటలో పయనించాలంటే వంతెన అవసరమని గుర్తించారు. దీనిలో భాగంగా గురుప్రియ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోల్‌కతాకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని జోడాంబ్ వద్ద బీఎస్ఎఫ్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి, జవాన్ల సాయంతో 2016 నాటికి వంతెనను పూర్తి చేశారు. వంతెన పూర్తయిన తర్వాత ఇక్కడి మావోలు తమకు రక్షణ లేదని భావించి ఆంధ్రా–ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ ప్రాంతాలకు చాలావరకు తరలిపోయారు. అప్పటి నుంచి జవాన్ల రాకతో తమ బతుకుల్లో వెలుగులు వచ్చాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురుప్రియ వంతెన నిర్మాణం తర్వాత ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం స్వాభిమాన్ ఏరియాగా పిలుస్తున్నారు.



గురుప్రియ వంతెన

- గిరిజనుల్లో వెలుగులు నింపుతున్న జవాన్లు
- మావోల కంచుకోటలో అభివృద్ధికి అడుగులు
- అనునిత్యం రక్షణ కల్పిస్తూ అండగా నిలుస్తున్న వైనం



అమృత్‌సర్ వెళ్తున్న గిరిజన యువతతో అధికారులు

నిశీథిలో.. ఉషోదయం



మావోయిస్టుల దిష్టి బొమ్మను కాల్చివేస్తున్న గిరిజనులు



అప్పట్లో మావోలు కట్టుకున్న ఎర్రకోట

చిత్రకొండ సమితి.. ఈ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా పిలువబడేది. అభివృద్ధికి ఆమడ దూరంలో నిత్యం తుపాకీ చప్పుళ్లతో అదిరపడేది. జలాశయం మధ్యలో ఉండే కొన్ని గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితిలో నాటు పడవల్లోనే ప్రయాణాలు సాగించేవారు. కానీ 2009 నుంచి అక్కడి పరిస్థితులు మారాయి. బీఎస్ఎఫ్ జవాన్లు ఈ ప్రాంతానికి రావడంతో క్రమంగా మావోల అలజడి తగ్గింది. 2016లో ప్రారంభమైన గురుప్రియ వంతెన నిర్మాణంతో చీకటి బతుకుల్లో వెలుగులు వచ్చాయి.

మల్కన్‌గిరి: ఒకప్పుడు కటాఫ్ ఏరియాగా పిలవబడిన చిత్రకొండ సమితిలో పనాస్‌పూట్, రాల్లేగడ, జోడాంబ్, జాంత్రీ, ఓంద్రహల్, బోడపోడ, బోడఫోదర్, పెప్పరమేట్ల, హంతాల్‌గూడ 9 పంచాయతీలు ఉండేవి. ఈ పంచాయతీలు పూర్తిగా చిత్రకొండ జలాశయం మధ్యలో ఉండేవి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అక్కడి గిరిజనులు నాటు పడవల్లో ప్రయాణాలు సాగించేవారు. దీంతో అక్కడ ఎటువంటి అభివృద్ధి జరగక ప్రజలు సామాన్య ప్రపంచానికి దూరంగా బతికేవారు.

మావో రాజ్యం

ఇక్కడి గిరిజనులను మావోయిస్టులు పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్నారు. మావోల శాసనంలో గిరిజనుల జీవనంగా పరిస్థితి ఉండేది. జాంత్రీ పంచాయతీలో మావోలు ఒక ఎర్రకోటను నిర్మించుకొని అక్కడే ప్రజాకోర్టులు నిర్వహించేవారు. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపేవారు. సెల్ టవర్స్ కాల్చివేయడం, రహదారులు నిర్మిస్తామని వచ్చే కాంట్రాక్టర్లను చంపడం వంటి ఎన్నో అవాంఛనీయ ఘటనలకు మావోలు పాల్పడేవారు. దీంతో అభివృద్ధి అనే పదం ఆమడ దూరంలో ఉండేది.

జవాన్ల రాకతో మారిన రాత

అయితే ఇక్కడికి బీఎస్ఎఫ్ జవాన్లు 2009లో అడుగుపెట్టారు. ముందు సమితిలో క్యాంపు ఏర్పాటు చేసి మావోలను తరిమేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పోరాటంలో ఎంతోమంది జవాన్లు మావోల తూటాలకు బలయ్యారు. అయినా పట్టు వదలకుండా బీఎస్ఎఫ్ జవాన్లు కటాఫ్ ఏరియాను మార్చాలనే కృతనిశ్చయంతో ముందుకు వెళ్లారు. దీనిలో భాగంగా మెల్లమెల్లగా గిరిజనులకు దగ్గరై, ప్రజలను అభివృద్ధి వైపునకు నడిపించే చర్యలు తీసుకున్నారు.

స్వచ్ఛంద సేవలు

9 పంచాయతీల్లో గిరిజనుల రక్షణే తమ లక్ష్యంగా జవాన్లు పని చేస్తున్నారు. ప్రతీ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాలు, జన సంపర్క్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. యువతలో ప్రతిభను వెలికితీసేందుకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. అక్కడ ప్రతిభ చూపినవారిని జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతున్నారు. అలాగే ప్రభుత్వం అందజేస్తున్న ప్రతీ పథకం గిరిజనులకు అందేవిధంగా సహకరిస్తున్నారు. రహదార్లు వేయడం, సెల్ టవర్స్ నిర్మిచడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇక్కడి ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోలేదు. అలాంటి వారు 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తొలిసారి ఓట్లు వేశారు.

ప్రపంచాన్ని చూస్తున్న యువత

ఒకప్పుడు గ్రామం కూడా దాటని గిరిజన యువతకు బీఎస్ఎఫ్ జవాన్లు ప్రపంచం చూపించాలని నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా ముందుగా ఒక 20 మంది గిరిజన యువతను భువనేశ్వర్ తీసుకెళ్లారు. అక్కడ నుంచి పూరి శ్రీజగన్నాథ స్వామి దర్శనం చేయించి, పర్యాటక ప్రదేశాలను చూపించారు. అనంతరం ఇప్పటివరకు 15 బృందాలను బీఎస్ఎఫ్ జవాన్లు తమ సొంత ఖర్చులతో ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రా, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛండీఘడ్, మహారాష్ట్ర, కన్యకుమారి, తమిళనాడు, హైదరాబాద్ ఇలా అనేక ప్రదేశాలను చూపించారు. దీంతో యువతలో క్రమేపీ చైతన్యం పెరుగుతోంది. ఇప్పుడు స్వాభిమాన్ ఏరియా క్రమేపీ అభివృద్ధి బాటలో పయనిస్తోంది.

చదువు విలువ తెలుపుతున్నాం



ఒకప్పుడు మల్కన్‌గిరి జిల్లా అంటే మావోయిస్టుల కంచుకోటగా ఉండేది. కానీ ఇప్పుడు జవాన్లు గిరిజనులకు అండగా ఉంటూ వారిలో చైతన్యం కల్పిస్తున్నారు. చదువు విలువను తెలియజేస్తున్నాం. మొత్తం 2 వేలు మంది జవాన్లు గిరిజనులకు రక్షణగా ఉంటున్నారు. ఇక్కడి ప్రజలకు కావాల్సిన సాయం చేస్తుంటారు.

– బీఎస్ఎఫ్ డీఐజీ సైలేంద్ర కుమార్ సిన్హా

అనునిత్యం కూంబింగ్



జిల్లా మొత్తంలో 8 వేల మంది జవాన్లు ఉన్నారు. ప్రతీ సమితిలోనూ గిరిజనులకు అండగా ఉంటున్నారు. జిల్లా పోలీసులుతో పాటు జవాన్లు రాత్రీ పగలు తేడా లేకుండా అడవిలో అనునిత్యం కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోల అణిచివేతతో పాటు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తాం.

– మల్కన్‌గిరి ఎస్పీ నీతిష్ వాద్వనీ

బతుకులు మారాయి



బీఎస్ఎఫ్ జవాన్ల సహకారంతో మా బతుకులు మారాయి. కటాఫ్ ఏరియాలో ఒకప్పుడు మావోలకు ఇన్‌ఫార్మర్లుగా పని చేయాల్సిందే. లేదంటే చంపేసేవారు. బీఎస్ఎఫ్ జవాన్లు మాకు అండగా నిలిచి మా బతుకులు మార్చారు. జరుగుతున్న అభివృద్ధి పనుల్లో రోజు కూలీలుగా ఉపాధి కల్పించి మాకు రక్షణా కవచంలా కాపు కాస్తున్నారు. ప్రస్తుతం జవాన్లు ఉన్నారనే ధైర్యంతో ప్రశాంతంగా ఉంటున్నాం.

– మధన్ హంతాళ్, గిరిజనుడు



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న జవాన్లు



యువతికి వాలీబాల్ కిట్ అందజేస్తున్న దృశ్యం



నృత్యంలో సత్తాచాటిన యువతతో జవాన్లు

పశువుల వ్యాపారి వద్ద రూ.28.6 లక్షలు చోరీ



దుండుగులు అద్దాలు పగలుగొట్టిన బొలేరో వాహనం



డబ్బులు పోగొట్టుకున్న పశువుల వ్యాపారి నాయుడు



దుండగులను అడ్డగించడంతో కాలుకు దెబ్బ తగిలిన మెహబూబ్ షరీఫ్

జయపురం: నవరంగపూర్ జిల్లా డాబుగాం వారాంతపు సంతలో పశువులు కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామం నుంచి వచ్చిన పశువుల వ్యాపారి నుంచి రూ.28.6 లక్షలను దుండగులు దోచుకున్నారు. ఆలస్యంగా అందిన సమాచారం ప్రకారం.. డాబుగాం వారాంతపు సంతకు కొత్తవలసకు చెందిన వ్యాపారి రంగాలి నాయుడు (35) గురువారం మరో ముగ్గురు సహచరులతో బొలేరా వాహనంలో విచ్చేశాడు. సంతలో వాహనాన్ని ఒక చోట ఉంచి పశువులు బేరమాడేందుకు తన సహచరులతో కలిసి వెళ్లాడు. బొలేరాలో తాను తీసుకొచ్చిన డబ్బులను మూడు బ్యాగులలో ఉంచాడు. అయితే మధ్యాహ్నం దాదాపు ఒంటి గంట సమయంలో బైక్, ఆటోలో దాదాపు పది మంది దుండగులు వచ్చి ముఖాలకు నల్ల గుడ్డలు కట్టుకొని తుపాకులు, ఇతర మారణాయుదాలతో బొలేరా వాహనం డోర్లు అద్దాలు పగులగొట్టి లోపల ఉన్న మూడు బ్యాగులతో ఉన్న రూ.28.6 లక్షల నగదు దోచుకోవడంతో పాటు వాహనం టైర్లలో గాలి తీసివేశారు. అది చూసిన నవరంగపూర్ పశువుల వ్యాపారి మెహబూబ్ షరీఫ్(48) వారిని అడ్డగించగా మారణాయుధాలతో అతడిపై దాడి జరిపారు. వారు కొట్టిన దెబ్బలకు అతడి కాలు దెబ్బతింది. దుండగులు అక్కడ నుంచి డబ్బుతో పరారయ్యారు. డబ్బు దోచుకుపోయిన దొంగలు 20 నుంచి 25 ఏళ్ల వయస్సు వారని అక్కడ ఉన్నవారు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే డాబుగాం పోలీసులు సంతకు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్టు




అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా బెల్లిగుంటా బ్లాక్‌లో కొద్ది రోజుల నుంచి రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి నలుగురు మహిళలతో సహా 8 మంది పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి ప్రకాష్ కుమార్ సాహు తెలిపిన వివరాల మేరకు.. గంజాం పోలీసు జిల్లా బెల్లిగుంటా పోలీసుస్టేషన్ పరిధి గోపినాథ్ వీధిలోని ఒక ఇంటిలో రహస్యంగా కొద్దిరోజుల నుంచి జూదం అడ్డా నడుస్తోంది. సమాచారం అందుకున్న బెల్లిగుంటా పోలీసులు జూదం అడ్డాపై దాడిచేసి నలుగురు మహిళా జూదరులతో సహా 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.82,700 నగదు, 5 సెల్‌ఫోన్లు, మూడు పేకకట్టలను స్వాధీనం చేసుకున్నారు.

దగ్ధమైన ప్రైవేటు బస్సులు



అగ్నిజ్వాలలో సిటీ బస్సులు



పూర్తిగా దగ్ధమైన బస్సులు

జయపురం: స్థానిక సిటీ బస్సు టెర్మినల్‌లో ప్రైవేటు బస్సులు అకస్మాత్తుగా దగ్ధమయ్యాయి. ప్రైవేట్ బస్టాండ్ ఎదురుగా ఉన్నటువంటి సిటీ బస్సు టెర్మినల్‌లో ఎంతోకాలంగా 20 సిటీ బస్సులు అధికారుల నిర్లక్ష్యానికి మూలన పడి ఉన్నాయి. వాటిలో గత రాత్రి అగ్ని ప్రమాదానికి లోనై రెండు బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఎవరో దుండగులు బస్సులను తగులబెట్టారని అనుమానిస్తున్నారు. వాస్తవంగా 2016లో కొరాపుట్ జిల్లా ప్రజల కోసం సిటీ బస్సుల సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతగా 20 సిటీ బస్సులు సమకూర్చింది. ఈ బస్సులు నక్సల్ ప్రభావిత రూట్‌లలో ముఖ్యంగా కోట్‌పాడ్, బొరిగుమ్మ, జయపురం, కొరాపుట్, సునాబెడ, దమంజొడీలకు నడపాలని ప్రభుత్వం నిర్దేశించింది. కేంద్ర ప్రభుత్వ జవహర్ జాతీయ అర్బన్ డవలప్‌మెంట్ పథకంలో భాగంగా ప్రైవేట్ సంస్థ భాగస్వామ్యంలో 80 సిటీ బస్సులు నడపాలన్నది యోచన. మొదటి విడతగా 20 సిటీ బస్సులతో సిటీ సర్వీసులు ప్రారంభించారు. ఈ సిటీ బస్సులను నడిపే బాధ్యత జయపురంలోని గీతాంజలి ట్రాన్స్‌పోర్టుకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఒప్పందం చేసుకుంది. అనంతరం కొన్ని రోజుల తర్వాత 20 బస్సులను బస్సు టెర్మినల్‌లో నిలిపివేసింది. అప్పటి నుంచి సిటీ బస్సులు టెర్మినల్‌లో తుక్కుపడుతూ ఉన్నాయి. బస్సు సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్న కొరాపుట్ జిల్లాలో మూలపడి ఉన్న సిటీ బస్సులను నడపాలని ప్రజలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోలేదు. గత 7 ఏళ్లుగా మూలన పడిఉన్న సిటీ బస్సులకు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటి టెర్మినల్‌కు చేరుకొని మంటలను అదుపు చేశారు. పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఎవరో దుండగులు బస్సులను తగులబెట్టారని అనుమానిస్తున్నారు.

క్లుప్తంగా

సచేతన రథం ప్రారంభం



సచేతన రథం ప్రారంభిస్తున్న కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్

పర్లాకిమిడి: కరోనా అనంతరం జిల్లాకు తిరిగొచ్చిన ప్రవాస రాష్ట్ర కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు వారి పిల్లల చదువులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు జిల్లా కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ సూచించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ వద్ద అంతర్ రాష్ట్ర ప్రవాస శ్రామిక సచేతన రథాన్ని శనివారం ప్రారంభించారు. ఈ రథం జిల్లాలోని ఏడు సమితి కేంద్రాల్లో కార్మికుల ప్రయోజనాలపై ప్రచారం చేస్తుంది. విదేశాలలో పనిచేస్తున్న కార్మికుల వివరాలు, మరియు జిల్లాలో ఉన్న కార్మికుల రిజిస్ట్రేషన్లు లేదా వారి సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18003456703, లేదా 155368కు మెసేజ్ పంపించాలని జిల్లా కార్మిక సంక్షేమ అధికారి లోక్‌నాథ పండా సూచించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సురక్షా సమితి అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, గ్రామీణ కార్మిక అధికారి సోమనాథ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని అడవి జంతువు మృతి



బేసి రామచంద్రాపురం వద్ద మృతి చెందిన అడవి జంతువు

సోంపేట: బేసిరామచంద్రాపురం గ్రామం సమీపంలో జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని శుక్రవారం రాత్రి అడవి జంతువు మృతి చెందింది. స్థానికులు శనివారం ఉదయం మృతదేహాన్ని గుర్తించారు. అడవి పిల్లి అయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి



ఘటన స్థలంలో కృష్ణారావు మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని అక్కవరం జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కళింగపట్నం కృష్ణారావు(60) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన కృష్ణారావు అక్కవరం వచ్చి పనులు ముగించుకుని తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా అటుగా నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వస్తున్న డబ్ల్యూబీ66ఏపి8777 నంబర్ గల కారు ఆయనను ఢీకొట్టింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. అయితే ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ కారును వెంబడించి పట్టుకున్నారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి ఎస్ఐ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దూడపై గుర్తు తెలియని జంతువు దాడి



మృతిచెందిన ఆవు దూడను పరిశీలిస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని జాడుపూడి గ్రామంలో గల జీడితోటలో ఓ ఆవు దూడపై గుర్తు తెలియని జంతువు దాడి చేసి హతమార్చింది. ఈ విషయాన్ని శనివారం వేకువజామున గుర్తించారు. ఈ దూడ స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు జామి జయకు సంబంధించినది. ఆమెకు చెందిన జీడితోటలో నాలుగు ఆవులు, ఈ ఆవుదూడను కట్టి ఉంచారు. శనివారం ఉదయం పాలు పిండటానికి ఆమె భర్త నీలకంఠం వెళ్లేసరికి దూడ పరిస్థితిని చూసి ఆశ్చర్యపోయారు. గ్రామంలో ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొన్నారు. ప్రస్తుతం పెద్ద పులి తిరుగుతుండడంతో అంతా భయపడ్డారు. అటవీ అధికారులు అక్కడకు చేరుకుని అడుగుల పరిమాణం పరిశీలిస్తే 7 సెంటీమీటర్లు పొడవు, 5 సెంటీమీటర్లు వెడల్పు గల పాదముద్రలు ఉండడంతో పులి కాదని నిర్ధారించుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకొని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని, పరిస్థితిని పరిశీలించారు.

వైభవం.. ఆదివాసీ మహోత్సవం

- ప్రారంభమైన కొరాపుట్ పర్వ్



భైరవ మందిరం నుంచి కొరాపుట్ మసాలాను తోడ్కొని వస్తున్న నాయకులు



జయపురంలో పర్వ్ ర్యాలీ సందర్భంగా ఆదివాసీల నృత్యాలు

సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మలో ప్రసిద్ధ భైరవ మందిర ప్రాంగణలో రాష్ట్రస్థాయి ఆదివాసీ మహోత్సవం కొరాపుట్-23 శనివారం ప్రారంభమైంది. స్థానికులంతా ర్యాలీగా భైరవ పీఠానికి వెళ్లి కొరాపుట్ పర్వ్ మసాలాను వెలిగించారు. ర్యాలీకి ముందు ఆదివాసీలు తమ ప్రత్యేకమైన నృత్య ప్రదర్శనలు చేపట్టారు. ఒడిశాలో వివిధ గిరిజన సంప్రదాయ తెగల వారికి విలువైన సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్నాయని, వాటిని కాపాడుకునేందుకు రాష్ట్రస్థాయి ఆదివాసీ మహోత్సవం కొరాపుట్ పర్వ్ ఒక వేదిక అవుతుందని వక్తలు పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లాలోని 14 సమితులు, రెండు మున్సిపాలిటీలు, రెండు నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్‌ల నుంచి ఆదివాసీ డాన్స్ గ్రూపులు, వాయిద్య కళాకారులు పాల్గున్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు. - జయపురం



పర్వ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజలు



పర్వ్ ప్రారంభోత్సవంలో కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



ఆకట్టుకుంటున్న గిరిజనుల నృత్యాలు



పర్వ్‌లో చిన్నారి కళాకారులతో అతిథులు



ఆదివాసీ యువతుల ధింసా నృత్యం



ఆదివాసీల సాంప్రదాయ వేషధారణలు

రత్న భాండాగార్‌కు లేజర్ స్కానింగ్

- పురావస్తు శాఖ అనుమతి
- సీఏవో రంజన్ కుమార్ దాస్



పాలక మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీలో జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగార్‌లో లేజర్ స్కానింగ్ చేయడానికి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)కి అనుమతించినట్లు శ్రీజగన్నాథ ఆలయం ప్రధాన పాలన అధికారి సీఏవో రంజన్ కుమార్ దాస్ తెలిపారు. శ్రీజగన్నాథ ఆలయ పాలక మండలి సమావేశం అనంతరం పూరీలో సీఏవో మీడియాతో మాట్లాడుతూ.. రత్న భండాగార్ లేజర్ స్కానింగ్ కోసం ఏఎస్ఐ గతంలో అనుమతి కోరిందని తెలియజేశారు. ఈ ప్రతిపాదనపై శనివారం జరిగిన సమావేశంలో వివిధ కోణాల్లో చర్చ జరిగిందన్నారు. రత్న భాండాగార్‌ను లేజర్ స్కానింగ్ చేసేందుకు ఏఎస్ఐని అనుమతించాలని కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

- భక్తుల రద్దీ ఉండడంతో...

కార్తీక మాసం కారణంగా జగన్నాథ ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నందున ఏఎస్ఐ ఇప్పుడు తన పనిని సౌకర్యవంతంగా నిర్వహించలేకపోవచ్చునని సీఏవో తెలిపారు. స్కానింగ్ యంత్ర పరికరాలు చేరాయన్నారు. కార్తీక మాసం రద్దీ దృష్ట్యా సానుకూలతని పరిగణనలోకి తీసుకుని ఏఎస్ఐ తెలియజేసిన మేరకు స్కానింగ్ కోసం తేదీ ఖరారు చేయడం జరుగుతుందని వివరించారు. రత్న భాండాగార్ లోపలి పరిస్థితి ఇతరేతర అనుబంధ వివరాలను స్కానింగ్ ప్రక్రియ వెలుగులోకి తెచ్చే అవకాశం ఉంది. రత్న భండార్ తెరవడంపై వివిధ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో, ఈ విషయంలో దిశానిర్దేశం చేయాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సమీర్ మహంతి ఒడిశా హైకోర్టును ఆశ్రయించారు.

- ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు ఆదేశాలు

రత్న భాండాగార్‌ను పరిశీలించి ఆభరణాలు వగైరా అమూల్య సంపద జాబితా నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశించింది. అయితే ఇప్పటివరకు కమిటీ ఏర్పాటు చేయలేదని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి తెలిపారు. లేజర్ స్కానింగ్ పూర్తయ్యాక కొంతవరకు స్పష్టత వస్తుంది. అనంతరం తదుపరి కార్యాచరణకు హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

- శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు అంకితం

శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్ట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి 17న ప్రజల కోసం తెరుస్తారు. ఈ సందర్భంగా ప్రతిష్టాపన కార్యక్రమం ఖరారు చేశారు. ఈ కార్యక్రమం 5 రోజుల పాటు నిరవధికంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా శ్రీమందిరం నలువైపులా యజ్ఞం నిర్వహిస్తారు. శ్రీమందిరం నాలుగు ద్వారాల ప్రాంగణాల్లో చతుర్వేద పారాయణ కార్యక్రమం ఖరారైంది. శ్రీ మందిరం పరిసరాల్లో ఆధ్యాత్మిక పర్యావరణ ఆవిష్కరణకు ప్రత్యేక ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రత్యేక కారిడార్‌ను ప్రారంభించిన తర్వాత భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మేఘనాథ్ ప్రహరి వరకు సునాయాసంగా చేరగలుగుతారు. సామానులు భద్రపరిచే గది, విశ్రాంతి గదులు ఏర్పాట్లు చేశారు. ప్రధాన దేవస్థానం నుంచి 500 మీటర్ల దూరంలో సువిశాల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తారు. దుకాణాలు, ఫుడ్ కోర్టులు మరియు సాంస్కృతిక కార్యక్రమాల కోసం ఆడిటోరియం కూడా నిర్మించబడ్డాయి.

ఓలీవుడ్ నిర్మాత టుట్టూ నాయక్ అరెస్ట్



టుట్టూ నాయక్‌ను అరెస్టు చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: మహిళా జర్నలిస్టుపై దాడి చేసిన కేసులో ఒడియా సినీ నిర్మాత సంజయ్ నాయక్ అలియాస్ టుట్టూ నాయక్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. భువనేశ్వర్ జోన్-4 ఏసీపీ మానస్ గొడోనాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఓలీవుడ్ నిర్మాతను ఖారవేళ నగర్ థాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి సంజయ్ నాయక్‌ను పోలీసులు రెండు గంటల పాటు అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం లాంఛనంగా అరెస్టు చేశారు. శుక్రవారం రాజధాని నగరంలోని ఓ సినిమా హాల్ దగ్గర రిపోర్టింగ్ చేస్తున్న జర్నలిస్టు దేవస్మిత రౌత్‌పై సినీ నిర్మాత దాడి చేసి చెంపపై కొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. అనంతరం మహిళా జర్నలిస్టు టుట్టూ నాయక్‌పై ఖారవేళ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన ప్రజలలో ఆగ్రహానికి దారితీసింది. రాష్ట్రంలోని వివిధ పోలీసుస్టేషన్లలో అనేక ఎఫ్ఐఆర్ నమోదు చేయబడ్డాయి. ఒడిశా ఉమెన్ ఇన్ మీడియా (ఓడబ్ల్యూఎం) సభ్యులు భువనేశ్వర్ డీసీపీ ప్రతీక్ సింగ్‌ను కలిసి తోటి జర్నలిస్టుపై దాడిపై న్యాయ సమ్మతంగా విచారణను కోరుతూ ఒక మెమోరాండం సమర్పించారు. ఈ సంఘటనను ఖండిస్తూ నగరంలో పని చేస్తున్న మహిళా జర్నలిస్టులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని ఓడబ్ల్యూఎం సభ్యులు డీసీపీని కోరారు. బాధిత జర్నలిస్టు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆరోపణలను ధ్రువీకరించేందుకు థియేటర్‌లోని సీసీటీవీ ఫుటేజీని స్కాన్ చేశారు. టుట్టూ నాయక్‌పై ఐపీసీ సెక్షన్‌లు 341 (తప్పుడు సంయమనం), 323 (స్వచ్ఛందంగా గాయపరచడం), 294 (అసభ్య పదజాలం) మరియు 354 (ఆమె నమ్రతను అగౌరవపరిచే ఉద్దేశంతో ఆమెపై దాడి లేదా నేరపూరిత బలవంతం) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఘనంగా గజలక్ష్మీ పూజలు



పూజలందుకుంటున్న గజలక్ష్మీ దేవి

పర్లాకిమిడి: స్థానిక కంచ్రవీధి, గాంధీ జంక్షన్లలో గత వారం రోజులుగా జరుగుతున్న గజలక్ష్మీ పూజలు ఆదివారంతో ముగియనున్నాయి. గాంధీ జంక్షన్‌లో శనివారం గజలక్ష్మీని దర్శించుకుని అనేకమంది మహిళలు దీపారాధన చేశారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు దీపారాధన చేశారు. ఆదివారం గజలక్ష్మీ పూజలు ముగియనుండడంతో అనేకమంది అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

నవంబర్ 21 నుంచి శీతాకాల సమావేశాలు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ శీతాకాల సమావేశాలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర శాసనసభ శనివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో 16వ శాసన సభ 14వ విడత శీతాకాల సమావేశాలు నవంబర్ 21న ప్రారంభమవుతాయని పేర్కొంది. ఈ సమావేశాలు డిసెంబర్ 30వ తేదీ వరకు కొనసాగుతాయి. 2024లో రాష్ట్రంలో సాధారణ ఎన్నికలకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శీతాకాల సమావేశాలు 16వ శాసన సభ చివరి సమావేశాలు కావచ్చు. శాసన సభ వర్షాకాల సమావేశాలు ఇటీవల ముగిసిన విషయం తెలిసిందే. ఈ సమావేశాలు ముందస్తు ప్రకటన కంటే ఒక రోజు ముందుగా అక్టోబర్ నెల 4న ముగిశాయి. సెప్టెంబర్ 22న కొత్త స్పీకర్‌గా ప్రమీలా మల్లిక్ ఎన్నిక కావడంతో వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. అనుబంధ వ్యయ మంజూరి బిల్లు 2023తో సహా 13 బిల్లులు ఈ సమావేశాల్లో ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించబడ్డాయి. రూ.28,200 కోట్ల సప్లిమెంటరీ బడ్జెట్‌ను సభలో ఆమోదించారు.

ఆర్థిక పురోగతి సాధించాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: పటిష్టమైన పనితీరుతో ఆర్థిక పురోగతి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధికారులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన శనివారం వివిధ శాఖల కార్యదర్శులు, సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. స్థానిక లోక్‌సేవా భవన్‌లో జరిగిన సమావేశంలో ఈ నెలలో జరగనున్న జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సులో చర్చించాల్సిన వివిధ అంశాలను చర్చించారు. అక్టోబర్‌లో వివిధ శాఖల పనితీరుని అభివృద్ధి కమిషనర్ మరియు అదనపు ముఖ్య కార్యదర్శి అనూగర్గ్ సమీక్ష సమావేశంలో ప్రవేశ పెట్టారు. అక్టోబర్ నెలాఖరు నాటికి వివిధ శాఖల పనితీరుతో ఆర్థిక పురోగతిని విశ్లేషించారు. గతేడాది కంటే ఈ ఏడాది అక్టోబర్ నెలలో అన్ని విభాగాల పనితీరు విశేషంగా మెరుగుపడిందని వివరించారు.

- వరి సేకరణ ప్రారంభం

ఈనెలలో ఖరీఫ్ వరి సేకరణ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కార్యదర్శులందరూ అధికారిక పనులపై జిల్లా పర్యటనకు వెళ్లే సమయంలో ఆయా ప్రాంతాల్లో మండీల సన్నద్ధతని పరిశీలించాలని ప్రత్యేకంగా సూచించారు. ఈనెల 9, 10 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ తృణ ధాన్యాల సదస్సు దృష్ట్యా చురుకుగా సన్నాహాలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరబింద పాఢి ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో అక్టోబర్‌లో ప్రారంభించిన వివిధ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించారు. ఐదు సూప ర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, లక్ష్మీ బస్సు సేవలు, అమో ఒడిశా - నవీన్ ఒడిశా కార్యక్రమం, ఛెలిగొ డొ ప్రాజెక్ట్ మరియు వివిధ జిల్లాల్లో కొత్త నీటి పారుదల ప్రాజెక్టుల ఆమోదం, కార్యాచరణ తదిత ర పలు అంశాలపై చర్చించారు. గతేదాది కంటే 145 శాతం అధికంగా మత్స్యశాఖ పనితీరుతో ఉన్న త ఉత్పాదనతో వృద్ధిని సాధించినట్లు సమీక్షలో తేలింది. మిషన్ శక్తి స్కూటర్ పథకంలో 15,000 స్కూటర్లు అందజేసినట్లు పేర్కొన్నారు. పూరీలో మూడేళ్ల క్రితం ప్రారంభించిన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ పథకం మూడేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సమయంలో 24 పట్టణ సంస్థలకు ఈ పథకం కింద పైపుల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు ప్రధాన కార్యదర్శి తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అదనపు ముఖ్య కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కమిషనర్లు, శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంస్య పతక విజేతకు అభినందనలు



ప్రకాష్‌రావును అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ - 2023లో దేశానికి కాంస్య పతకం సాధించి పెట్టిన జిల్లా క్రీడాకారుడు ములపర్తి ప్రకాష్‌రావును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. జెడ్పీ చైర్మన్ శనివారం తన కార్యాలయంలో ప్రకాష్‌రావును సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 50 మంది ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన జిల్లా వెయిట్ లిఫ్టర్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు శనివారం హోరాహోరీగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వెయిట్ లిఫ్టర్లు ఎంపిక పోటీలకు హాజరై తమ సత్తా చాటారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన సుమారు 50 మందిని ఎంపిక చేశామని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి చల్లా రాము తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను అభినందించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేష్, అశ్విని, గాయత్రి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌పీల తొలగింపు : పీడీ

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన ఇద్దరు ఆర్‌పీలను తొలగించామని మెప్మా పీడీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఎస్ఎల్ఎఫ్‌ల గ్రూపులలో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని అన్నారు. శ్రీరామసీత ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్ శాసపు ఉమాదేవి, సీతారామ ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్ పొగిరి సంధ్యారాణి తమ పరిధిలోని ఎస్‌హెచ్‌జీ మెంబర్లకు తెలియకుండా సొంత అవసరాలకు మహిళా సంఘాల డబ్బులు వాడుకుని అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌జీ ఖాతాలన్నీ స్టేట్‌బ్యాంకు రాజాం మెయిన్ బ్రాంచిలోనే ఉన్నాయని అన్నారు. బ్యాంకు అధికారులు రుణాలు ఇచ్చే సమయంలో సక్రమంగా ఎస్‌హెచ్‌జీ తీర్మానాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా సంఘ సభ్యుల వ్యక్తిగత ఖాతాలకు కాకుండా ఆర్‌పీల చేతికి నగదు అందించడం అవకతవకలకు ముఖ్య కారణంగా గుర్తించామని పేర్కొన్నారు. అందుకు కారణమైన సదరు బ్యాంకుల పాత్రపై కూడా విచారణ చేసి తగిన చర్యలు నిమిత్తం సంబంధిత బ్యాంకు అధికారులకు లేఖలు రాశామని ప్రకటనలో వివరించారు. ఇప్పటికే ఆర్పీల అక్రమాలపై విచారణ చేపట్టామని, వారిని విధులు నుంచి పూర్తిస్థాయిలో తొలగించి వారి లాగిన్‌లను నిలుపుదల చేశామని అన్నారు. అవకతవకలకు పాల్పడిన మొత్తాన్ని రాబెట్టేందుకు ఇద్దరు ఆర్పీలపై చట్టపరమైన చర్యలకు సంతకవిటి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని పేర్కొన్నారు. సమగ్ర నివేదికను మెప్మా మిషన్ డైరెక్టర్‌కు సమర్పించామని, సభ్యులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన పార్వతి

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన బండి పార్వతి (33) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఎస్ఐ వీబీ రామకృష్ణ తెలిపిన వివరాలు.. శుక్రవారం రాత్రి ఇంటిని శుభ్రం చేసే క్రమంలో గచ్చును తడిగుడ్డతో వత్తుతోంది. గచ్చు ఆరేందుకు ఐరన్ టేబుల్ ఫ్యాన్ వేసింది. తిరుగుతున్న ఫ్యాన్‌ను పక్కకు జరుపుతుండగా షాక్‌కు గురై వెనుకకు పడిపోయింది. వెనువెంటనే ఆమెపై ఫ్యాన్ పడిపోవడంతో శబ్దం విన్న భర్త భాస్కరరావు ఫ్యాన్ తీసేందుకు ప్రయత్నించాడు. అతనికి కూడా షాక్ కొట్టడంతో మెయిన్ ఆఫ్ చేసి పక్కింటిలో ఉన్న శేఖర్ అనే అతని సహాయంతో ఫ్యాన్ తీసి ఆమెను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని కొఠారిపురం గ్రామానికి చెందిన ఆమె తల్లి నక్క రమణమ్మకు తెలియజేయగా ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సిరుల 'చోడి'



సాగులో ఉన్న చోడి పంట

- చోడి ఉత్పత్తిని కొనుగోలు చేయనున్న ప్రభుత్వం
- క్వింటాకు మద్దతు ధర రూ.3860
- ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి
- రబీ చోడి పంట లక్ష్యం 4 వేల హెక్టార్లు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో వ్యవసాయం అధిక శాతం వర్షాధారంగానే సాగవుతుంది. వర్షాలు కురిసి చెరువులు, గుంతలు నిండితే ఆ నీటితో పంటలు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొంటే పంటలు కాపాడుకోలేని పరిస్థితి. వరి పంటకు పంట చివరి దశ వరకు నీరు ఎక్కువగా అవసరం ఉంటుంది. అయితే వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు వరి పంటను కాపాడుకోవడం కష్టతరం అవుతుంది. ఈ నేపథ్యంలో ఆరుతడి పంట అయిన చోడి సాగు చేసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. తక్కువ నీటితో చోడి పంటను సాగు చేయవచ్చు. దీని వల్ల చోడి పంట లాభదాయకంగా ఉంటుంది. రబీలో చోడి పంటను అధికంగా సాగు చేసేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం కూడా చోడి పంటను సాగు చేసే రైతులను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపడుతుంది. చోడి పంట ఉత్పత్తిని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. అంతేకాకుండా రైతులకు మంచి మద్దతు ధర లభించనుంది. ఈ నేపథ్యంలో చోడి పంటను సాగు చేసుకుంటే రైతులు సిరులు పండించినట్టే.

రబీ లక్ష్యం 4 వేల హెక్టార్లు

గత ఏడాది రబీలో 1000 హెక్టార్లలో చోడి పంట సాగైంది. ఈ ఏడాది 4 వేల హెక్టార్లలో చోడి పంట సాగు అయ్యే విధంగా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు విత్తనాలు కూడా సిద్ధం చేస్తున్నారు. 120 క్వింటాళ్లు 50 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎకరాకు 2 కేజీల విత్తనం

ఎకరం పొలంలో చోడి పంట సాగుకు 2 నుంచి రెండున్నర కేజీల విత్తనం సరిపోతుంది. నీటి తడులు పెద్దగా అవసరం ఉండదు. ఒకటి రెండు తడులు పెడితే సరిపోతుంది. 25 కేజీల డీఏపీ, 50 కేజీల యూరియా వేస్తే సరిపోతుంది. ఎకరంలో సాగు చేయడానికి రూ.6 వేల నుంచి రూ.8 వేలు సరిపోతుంది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.3860 మద్దతు ధర ప్రకటించింది. ఈ లెక్కన ఎకరానికి రూ.8వేలు వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు పోను రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది.

కొనుగోలు చేయనున్న ప్రభుత్వం

ధాన్యం కొనుగోలు చేసినట్టే ప్రభుత్వం చోడి పంటను కూడా కొనుగోలు చేయనుంది. ప్రభుత్వం కొనుగోలు చేయడం వల్ల రైతులకు మద్దతు ధర లభిస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించిన ప్రభుత్వం రైతుల ఖాతాల్లోకి ధాన్యం సొమ్మును జమ చేస్తోంది. అదే విధానాన్ని చోడి పంటకు అమలు చేయనుంది.

సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు



చోడి పంట విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చోడి విత్తనాలను రాయితీపై రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 4 వేల హెక్టార్లలో చోడి పంట సాగు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ధాన్యం కొనుగోలుపై పరిమితి వద్దు

- రైతు సంతృప్తే లక్ష్యంగా కొనుగోలు
- 5 రోజుల్లోనే నగదు జమ
- సివిల్ సప్లయిస్ కమిషనర్ అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్

విజయనగరం అర్బన్: రైతులు కొనుగోలుపై పరిమితి లేకుండా కేంద్రాలకు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని సివిల్ సప్లయిస్ కమిషనర్ హనుమంతు అరుణ్‌కుమార్ ఆదేశించారు. రైతు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని ఆయన స్పష్టం చేసారు. జిల్లాలో శనివారం ఆయన పర్యటించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ముందుగా జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితిని ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ ఏడాది సుమారు 4,63,624 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. దీనిలో స్థానిక అవసరాలు పోనూ, మార్కెట్‌కు సుమారుగా 4,05,200 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని దీనిలో దాదాపు 3,41,000 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. జిల్లాలో 510 రైతుభరోసా కేంద్రాలు ఉన్నాయని, 246 క్లస్టర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. నవంబర్ 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని చెప్పారు. కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ లక్ష్యంతో సంబంధం లేకుండా రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు మేలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రైతు సంతృప్తి, సంతోషం మన లక్ష్యాలు కావాలని సూచించారు. మిల్లు సామర్థ్యం బట్టే లక్ష్యాలు కేటాయించాలని ఎక్కువ బ్యాంకు గ్యారంటీ ఇచ్చినా సామర్థ్యం కంటే అదనంగా ధాన్యం కేటాయించవద్దని స్పష్టం చేశారు. ఒక్కో ఆర్‌బీకేకి 10 నుంచి 15 వాహనాలను కేటాయించాలని, ప్రతీ వాహనానికి జీపీఎస్ అనుసంధానం చేయాలని ఆదేశించారు. గోనె సంచులు, లేబర్ ఖర్చులను రైతులే చెల్లిస్తే వారికి జమ చేస్తామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 5 రోజుల్లోనే రైతులకు డబ్బు చెల్లించేందుకు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. సమావేశంలో డీఎస్ఓ మదుసూధనరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎం మీనాకుమారి, జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, వివిధ శాఖల జిల్లా అధికారులు, సివిల్ సప్లయిస్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి శాంతి సద్భావనా యాత్ర



తానా శాంతి సద్భావనా యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం: తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన వందే విశ్వమాతరం పేరుతో 100 దేశాల సద్భావనా యాత్ర ప్రారంభంకానుంది. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ శనివారం ఉదయం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కార గ్రహీత సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వెలుగులు విరజిమ్ముతూ, తెలుగు సాహితీ సౌరభం గుబాళింపచేస్తూ, విశ్వశాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి రక్షణ, మానవీయ విలువల వంటి బృహత్ లక్ష్యాలతో ప్రారంభమవుతున్న యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తానా ఖ్యాతి మరింత పెరగాలని అభిలషించారు. శతశతకకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ వందేవిశ్వమాతరమ్ పేరుతో వందకు పైగా దేశాల్లో శాంతిసద్భావనాయాత్రకు శ్రీకారం చుట్టడం గొప్పవిషయమని పేర్కొన్నారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, చైతన్య ప్రపంచ యాత్ర రెండేళ్లపాటు జరుగుతుందని వివరించారు. 9వ తేదీన ఆఫ్రికా ఖండంలో బోట్స్‌వానా దేశంలో తెలుగు సంఘం అధ్యక్షుడు తోటకూర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, తానా పూర్వ అధ్యక్షుడు వందే విశ్వమాతరం చైర్మన్ తాళ్లూరి జయశేఖర్ ఆధ్వర్యంలో యాత్ర జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

పారాది బ్రిడ్జిపై నిలిచిన ట్రాఫిక్



పారాది బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

బొబ్బిలి: మండలంలోని పారాది బ్రిడ్జిపై వాహనచోదకులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడపడంతో శనివారం ఉదయం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఉదయం కొందరు వాహనదారులు అడ్డదిడ్డంగా బ్రిడ్జి లోపలకు వెళ్లడంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు చోటు లభించక రద్దీ ఎక్కువైంది. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

రాయగడ-విజయనగరం లైన్‌లో పలు రైళ్ల రద్దు

పార్వతీపురంటౌన్: రాయగడ-విజయనగరం స్టేషన్ల పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే పలు రైళ్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రద్దుచేసినట్టు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న విశాఖ-రాయగడ పాసింజర్, 6న రాయగడ-విశాఖ, విశాఖ-కొరాపుట్, విశాఖ-కొరాపుట్ ఇంట్రసిటీ, 7న కొరాపుట్-విశాఖ ఇంట్రసిటీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దుచేసినట్టు తెలిపారు. ఈ నెల 5న గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుందన్నారు.

చెరకు రైతుల కోసం తూనిక కేంద్రాలు

- రైతులు వినియోగించుకోవాలి
- ఈఐడీ ప్యారీ ఏజీఎం(కేన్) మురళి



లక్ష్మీపురంలో చెరకు తూనిక యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఈఐడీ ప్యారీ ఏజీఎం మురళి

సీతానగరం: సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో చెరకు క్రషింగ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఉత్పత్తి చేసిన చెరకును తరలించేందుకు చెరకు తూనిక యంత్రాలు ఏర్పాటు చేసినట్టు ఆ కర్మాగారం కేన్ ఏజీఎం మురళీ తెలిపారు. మండలంలోని నిడగల్లు, లక్ష్మీపురం, బూర్జ గ్రామాల్లో చెరకు తూనిక యంత్రాలను రైతుల సమక్షంలో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరకు క్రషింగ్ సీజను రావడంతో రైతుల్లో చెరకు తరలింపుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చెరకు రైతులు పండించిన చెరకును సుగర్‌కేన్ డిప్యూటీ కమిషనర్ సూచనల మేరకు బొబ్బిలి, సీతానగరం జోన్‌ల పరిధిలో చెరకును ఈఐడీ ప్యారీ యాజమాన్యం కొనుగోలు చేయడమే కాకుండా చెరకు రైతులు ఆదుకుంటుందని, రాయితీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశించిన రెండు జోన్లలో 90 వేల టన్నుల చెరకు ఉత్పత్తి చేసారని చెప్పారు. దీన్ని రవాణా చేయడంలో ఇబ్బందుల్లేకుండా ఈఐడీ ప్యారీ యాజమాన్యం చెరకు కొనుగోలు చేయడానికి ఏడు తూనిక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. బూర్జ, లక్ష్మీపురం, ఏగోటివలస, సీహెచ్ బొడ్డవలస, రంగరాయపురం, కారాడ, బాడంగి చోట్ల తూనిక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. బొబ్బిలిలో క్రమ పద్ధతిలో కటింగ్ ఆర్డర్లు ఇచ్చి చెరకు లోడు కోసం లారీలు పంపించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, ఈఐడీ ప్యారీ వైస్‌చైర్మన్లు గంగాధర్‌రెడ్డి, నాగ శేషారెడ్డి, డీజీఎం కేన్ రాజేంద్ర సూచనల మేరకు 2024 - 25 క్రషింగ్ సీజనులో చెరకు విస్తీర్ణం 4 లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి చేయడానికి అవసరమైన రాయితీలు యాజమాన్యం ప్రకటించనుందని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



భాస్కరరావు (ఫైల్)

బొబ్బిలి: మండలంలోని గొర్లె సీతారాంపురం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఆ గ్రామానికి చెందిన బండి భాస్కరరావు(35) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... భాస్కరరావు గ్రామానికి పక్కనే ఉన్న గ్రోత్ సెంటర్‌లోని ఓ కంపెనీలో విధులు ముగించుకుని శుక్రవారం రాత్రి స్వగ్రామానికి తన మోటార్ బైక్‌పై వస్తున్నాడు. ఈ సమయంలో రోడ్డు పక్కగా బండిని నిలిపి ఉంచగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కరరావు తలకు గాయమై తీవ్ర రక్త స్రావంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య పద్మ, పదేళ్లలోపు వయసు గల కుమారులు సంజయ్, శ్రీనివాస్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాచిపెంట: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన పిన్నింటి సత్యనారాయణ (39) ఇటీవల మద్యానికి బానిసై భార్య భవానితో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడు. దీనిలో భాగంగా గత నెల 30వ తేదీన కూడా ఉదయం 9 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో భార్య మందలించింది. తీవ్ర మనస్తాపానికి గురైన సత్యనారాయణ పద్మాపురం సమీపంలో ఉన్న తన పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు సేవించాడు. కొద్ది సేపటి తర్వాత ఇంటికి వచ్చిన సత్యనారాయణ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో గుర్తించిన భార్య వెంటనే సమీప బంధువుల సహాయంతో పాచిపెంట సీహెచ్‌సీకి తీసుకువెళ్లింది. అక్కడి నుంచి అదే రోజు సాలూరు సీహెచ్‌సీకి.. విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి గత నెల 31వ తేదీన విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్ఐ ముసలయ్య తెలిపారు. మృతుడు సత్యనారాయణకు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు.

సెంచూరియన్‌లో రేడియోలజీ దినోత్సవం



విద్యార్థుల నృత్య ప్రదర్శన తిలకిస్తున్న వర్సిటీ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ప్రపంచ రేడియోలజీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి మాట్లాడుతూ నిత్య జీవితంలో అనువర్తనాలపై విద్యార్థులకు అవగాహన పెంచుకొని సామర్థ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, చైన్నై ప్రభుత్వ వైద్య కళాశాల ప్రతినిధులు మురుగేష్, శవనాగేష్, పృధ్వీ, రామయ్య, ఐఎస్ఆర్‌టీ రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు, డీన్ లక్ష్మీనరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు వంగర విద్యార్థి ఎంపిక



అశోక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం రమణమ్మ, పీడీ కవిత

వంగర: జాతీయ స్థాయి జూనియర్ విభాగం అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి దేవకివాడ అశోక్ ఎంపికయ్యాడు. ఈ నెల 7వ తేదీ నుంచి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో జరగనున్న 38వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో అశోక్ పాల్గొంటాడని హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, పీడీ బి.కవిత వెల్లడించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు.

మత్స్యకారులకు 10 లక్షల చేప పిల్లలు

- మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి



విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని మైదాన ప్రాంతంలో ఉన్న మత్స్యకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న మత్స్యకారులకు 10 లక్షల చేప పిల్లలను రాయితీపై అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 4.44 లక్షల చేపపిల్లలను పంపిణీ చేసినట్టు మత్స్యశాఖ డీడీ నేతల నిర్మలాకుమారి తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గానికి 4 లక్షలు, భోగాపురంలోని మత్స్యకారులకు 44 వేల చేపపిల్లలను అందజేశామన్నారు. మిగిలిన చేపపిల్లలను వారంరోజుల్లోగా మత్స్యకారులకు అందిస్తామని చెప్పారు. సొసైటీ చెరువుల్లో చేప పిల్లలను పెంచుకుని విక్రయించడం ద్వారా మత్స్యకారుల ఆదాయం వృద్ధిచెందుతుందన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాలే లక్ష్యం

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: తప్పులులేని ఓటర్ల జాబితాల రూపకల్పనే లక్ష్యంగా బీఎల్‌ఓలు పని చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఓటర్ల జాబితాలపై పూర్తిబాధ్యత బీఎల్‌ఓలదేనని స్పష్టం చేశారు. కె.ఎల్.పురంలోని 23, 24 పోలింగ్ స్టేషన్లను, గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్ పరిధిలోని పోలింగ్ కేంద్రం వద్ద జరుగుతున్న సమ్మరీ రివిజన్‌కి సంబంధించిన స్పెషల్ కాంపెయిన్‌ను కలెక్టర్ శనివారం సందర్శించారు. జాబితాలో అక్కడక్కడ ఫొటోలు లేకుండా ఉన్న ఓటర్లను గమనించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఫారం 6, ఫారం 8లు ఎన్నెన్ని వచ్చాయి, ఎలా పరిష్కరించారని ప్రశ్నించారు. వందేళ్ల వయస్సు దాటిన వారు ఎంత మంది ఓటర్లు ఉన్నారని అడిగారు. డెత్ ఓటర్లు డూప్లికేషన్లు లేకుండా చూడాలని, స్పెషల్ కాంపెయిన్ తర్వాత ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలు క్రాస్‌చెక్ చేసి చూడాలన్నారు. గొట్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుబయట తరగతుల నిర్వహణపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. నాడు-నేడు పనులు జరుగుతున్నాయని, 9, 10వ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్టు హెచ్‌ఎం వివరించారు.

రోడ్డెక్కిన మహిళలు



సభ్యులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలు శనివారం రోడ్డుపై బైఠాయించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆందోళన చేశారు. తమకు న్యాయం చేసేంత వరకు కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. ఆర్పీ ఉమాదేవి మహిళా సంఘాల సభ్యుల నగదు స్వాహా చేసారని, ఆమెను తీసుకురావాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరువైపులా వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఆర్పీని తీసుకువచ్చి సమస్య పరిష్కరించడంతో పాటు సొమ్ము రికవరీ చేయించాలని మహిళలంతా కోరారు. ఇందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ సంఘాల సభ్యులంతా దర్యాప్తునకు సహకరించాలని కోరారు. దగా పడిన గ్రూపుల్లో 13 గ్రూపులు మాత్రమే విచారణకు వచ్చాయని, మిగిలిన ఏడు గ్రూపులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఆ ఏడు గ్రూపులకు ఆర్పీ డబ్బులు చెల్లిస్తామని చెప్పిందని లీడర్లు తమకు తెలియజేయడంతోనే మిన్నకుండిపోయామని సభ్యులంతా బదులిచ్చారు. అంతా సహకరిస్తే దర్యాప్తు వేగవంతం చేసి కొలిక్కి తీసుకురాగలమని తెలిపారు. దీంతో మిగిలిన ఏడు గ్రూపుల సభ్యులు సహకరించేందుకు అంగీకరించారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

జోరందుకుంటున్న విమానాశ్రయ పనులు



విమానాశ్రయ నిర్మాణం కొరకు చదును చేసిన భూమి



విమానాశ్రయ నిర్మాణానికి మెటీరియల్‌ను సిద్ధం చేస్తున్న ఎల్‌అండ్‌టీ సంస్థ

భోగాపురం: భోగాపురం మండలంలో నూతనంగా నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీఎంఆర్ సంస్థ విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన పలు పనులను సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఎల్ అండ్‌టీ, జీఎంఆర్ సంస్థలు సంయుక్తంగా పలు పనులకు ఈ నెల 1వ తేదీన శంకుస్థాపన చేశారు. అనంతరం మరడపాలెం సమీపంలో భూమి చదును పనులు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి విమానాశ్రయ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా జీఎంఆర్ సంస్థ ముందుకు సాగుతోంది. పనులను జీఎంఆర్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

6న సీనియర్ బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాక్సర్ల ఎంపిక పోటీలు ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరగబోయే అంతర్ జిల్లాల సీనియర్స్ మెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.